క్లుప్తంగా

గంగమ్మకు విశేష పూజలు


విశేషాలంకరణలో అమ్మవారు

భాకరాపేట: చిన్నగొట్టి గల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సీకాం విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్: సీకాం డిగ్రీ కళాశాలకు చెందిన 72 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఆ కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన టెక్‌లాంగ్ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 72 మందిని ఆ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథరెడ్డి, డైరెక్టర్లు ప్రణీత్ స్వరూప్, తేజ్ స్వరూప్ అభినందించారు.

నివాళి


నివాళులు అర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎస్.నాగూర్‌బాషా తల్లి మాలిన్‌బీ(75) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం దామలచెరువులో మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ లోకనాథం, పార్టీ డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నాగూర్‌బీరహీం, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, ఇమ్రాన్, వినాయక, అల్తాఫ్, మోహన్ ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చోరీ కేసులో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా జ్యోతినగర్ కాలనీకి చెందిన మేకల వంశీధర్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. 2022 జూన్ 11వ తేదీ తిరుపతి గోపాలరాజు కాలనీలోని ఓ ఇంటి తలుపులు పగులగొట్టి పూజ గదిలో ఉన్న రూ.1800 నాణేలను వంశీధర్‌రెడ్డి అపహరించాడు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో నిందితుడు నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధించారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పుష్కరిణులు


కోనేరును పరిశీలిస్తున్న అంజూరు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నారద, వైష్ణవ పుష్కరిణిలను మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నం పరిశీలించారు. అంజూరు మాట్లాడుతూ, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పుష్కరిణిలను తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రతిరోజూ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, పట్టణ ప్రజలు సేద తీరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. అవసరమైన అంచనాలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు.

పాఠ్య పుస్తకాల పేరిట కార్పొరేట్ స్కూళ్ల దోపిడీ

శ్రీకాళహస్తి: పాఠ్య పుస్తకాల పేరిట కార్పొరేట్ స్కూళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జాకీర్ విమర్శించారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట, పుత్తూరు ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద వేలాది రూపాయలు గుంజుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కానుక పేరిట ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, మూడు జతల యూనిఫాం, ఒక జత షూస్ తదితర వాటితో కలిపి రూ.2,400 ఖర్చు చేస్తోందన్నారు.

చల్లంగ చూడు గంగమ్మ




గంగమ్మ.. గౌరమ్మ.. కరుణించి కాపాడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర అనంతరం చివరి ఐదో మంగళవారం కావడంతో తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మరు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ వేషాలు ధరించి వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మను కలువ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలతో సందడి చేశారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. - తిరుపతి కల్చరల్





ఎస్వీయూలో ముందస్తు యోగా దినోత్సవం


యోగా దినోత్సవ సంబరాల్లో విద్యార్థులు, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎస్వీయూలో ముందస్తు యోగా దినోత్సవం నిర్వహించారు. వివేకానంద కేంద్రం, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా విద్యార్థులకు సూర్య నమస్కారం నేర్పించాయి. దేశంలో ఉద్భవించిన యోగా ప్రపంచానికే ఆధ్యాత్మిక, మానసిక, శారీరక సాంత్వన చేకూరుస్తోందని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ప్రముఖ్ మారుతి మోహన్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, వివేకానంద కేంద్ర తిరుపతి చాప్టర్ ప్రముఖ్ హరికృష్ణ పాకనాటి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగా చేద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం


అవగాహన ర్యాలీలో ఆయుష్ వైద్యులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఆరోగ్య జీవనం సాధ్యమని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యుడు విజయకుమార్ అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో అవగాహన ర్యాలీ చేశారు. ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల నుంచి మంచినీళ్లగుంట, నరసింహ తీర్థం రోడ్డు, టౌన్ క్లబ్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా యోగా విశిష్టత గురించి ఆయన వివరించారు. యోగాసనాలు, ప్రాయామాలు, ధ్యానం శారీరక.. మానసిక ఆరోగ్యానికి సోపానాలని తెలిపారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేయాలి


వైఎస్సార్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

పాకాల: తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్లు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014 జూన్ 2 నాటికి ఉన్న జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలు, చలమారెడ్డి, చంద్ర, విజయలక్ష్మి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు


రామచంద్రాపురంలో బాల కార్మికున్ని గుర్తించిన కార్మిక శాఖ అధికారులు

పుత్తూరు రూరల్: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకునే వ్యాపార యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిరుపతి జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.బాలునాయక్ హెచ్చరించారు. మంగళవారం బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా పుత్తూరు న్యాయ సేవావిభాగం ఆధ్వర్యంలో కార్మిక శాఖ జిల్లా అధికారులు మండల కేంద్రాలైన వడమాలపేట, రామచంద్రాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రామచంద్రాపురంలోని రాకేష్ ఎంటర్‌ప్రైజెస్‌లో పని చేస్తున్న బాల కార్మికుడు ప్రహ్లాద్(14)ను గుర్తించారు. ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యానికి జరిమానా విధించి, బాలున్ని పాఠశాలలకు పంపే ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ బీవీఎస్ కృష్ణారెడ్డి, పుత్తూరు, కార్వేటినగరం లేబర్ ఆఫీసర్లు కె.హేమాచారి, జి.రంగనాథ్, ఐసీపీఎస్ మెంబర్లు దేవయాని, కల్పన పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




ఆలయం వెలుపల ఎంపీ ఎం. కవిత, బ్రజేష్ పాఠక్, జయహో రామానుజ చిత్ర బృందం

తిరుమల: పలువురు ప్రముఖులు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ ఎంపీ ఎం.కవిత, ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్, జయహో రామానుజ చిత్ర బృందం ఉన్నారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వీరికి వేదాశీర్వచనాలను, అధికారులు లడ్డు ప్రసాదాలను అందించారు.

వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్‌కు కన్నీటి వీడ్కోలు

రేణిగుంట: స్థానిక బుగ్గవీధికి చెందిన వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అమానుల్లాకు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. గుండెపోటుతో ఆయన హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో మృతి చెందారు. మంగళవారం ఆయ భౌతికకాయాన్ని బుగ్గవీధిలోని ఆయన ఇంటికి తీసుకొచ్చారు. రేణిగుంట ముస్లిం మైనారిటీ నేతగా, మాజీ ఎంపీటీసీగా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకునిగా ఆయన పట్టణవాసులకు సుపరిచితులు కావడంతో ఆయన అంతిమ యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిరుమల రెడ్డి, హైకోర్టు న్యాయవాది పేరూరు మునిరెడ్డి, రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్ తదితరులు ఆయనకు ఘన నివాళి అర్పించారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య


గాంధీపురంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ అన్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు మించిన వసతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్య, పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లతో పాటు పోషకాహారం అందిస్తోందని వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

తుది దశలో శ్రీనివాస సేతు

- నగర మేయర్ శిరీష


రైల్వే బ్రిడ్జిపై నిర్మిస్తున్న పనులను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణం తుది దశకు చేరుకుందని నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష అన్నారు. రైల్వే బ్రిడ్జిపై జరుగుతున్న నిర్మాణ పనులను మంగళవారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. తిరుమలకు వచ్చే భక్తులు, తిరుపతి నగరవాసుల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాలంటే శ్రీనివాస సేతు నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను, ఆఫ్కాన్స్ ప్రతినిధులకు మేయర్ సూచించారు. క్రేన్ సాయంతో ఫ్లైఓవర్ పై జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం శిరీష మాట్లాడుతూ.. టీటీడీ, తిరుపతి స్మార్ట్ సిటీ సంయుక్తంగా ఫ్లైఓవర్‌ని నిర్మిస్తోందన్నారు. మరో 25 రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు. శ్రీనివాస సేతు మొదటి, రెండు, మూడు దశల పనులు పూర్తి చేయడం జరిగిందని, నాలుగో దశ పనులు కొంచెం ఆలస్యమైందని చెప్పారు. రైల్వే బ్రిడ్జి వద్ద నిర్మాణ పనుల అనుమతులకు రైల్వే అధికారులకు ఆలస్యంగా ఫ్లైఓవర్ ప్లాన్‌ను సమర్పించారన్నారు. మూడు రోజుల్లో అనుమతి వస్తుందని, వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి జూలై నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నగర పాలక సంస్థ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ ప్రతినిధి స్వామి ఉన్నారు.

తిరుపతిలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తాం


ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుపై చర్చిస్తున్న కమిషనర్ హరిత, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుపై మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో కలిసి చర్చించారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడంపై చర్చించారు. తిరుపతి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అనువైన స్థలాన్ని ముందుగా గుర్తించాలని నిర్ణయించారు. ప్రజలకు ఇష్టమైన ఆహార పదార్థాలు ఒకే చోట తీసుకురావడం జరుగుతుందని మేయర్ శిరీష తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ.. తిరుపతిలో ఏర్పాటు చేసే ఫుడ్ స్ట్రీట్ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దుతామన్నారు. ఆరోగ్యవంతమైన వంటకాలను ఒకేచోట అందించేందుకు దీన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, మెప్మా కృష్ణవేణి పాల్గొన్నారు.

శ్రీవాణి ట్రస్ట్‌పై కుట్రపూరిత ఆరోపణలు

- టీటీడీ గోసంరక్షణ ట్రస్ట్ సభ్యుడు రామ్‌సునీల్ రెడ్డి



తిరుపతి రూరల్: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులపై చంద్రబాబు నాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయోజనాల కోసం కుట్ర పూరిత ఆరోపణలు చేస్తున్నారని టీటీడీ గోసంరక్షణ ట్రస్ట్ సభ్యుడు రామ్ సునీల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని రాజకీయ వివాదం చేసి హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా ఇద్దరూ కుట్ర చేశారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగానే మొదట దత్త పుత్రుడు, ఆ తరువాత దత్త తండ్రి శ్రీవాణి ట్రస్ట్‌పై ఆరోపణలు చేశారన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి నేతృత్వంలో సాధారణ భక్తులకు పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం, దర్శనం టిక్కెట్‌కు రూ.500 చెల్లించిన ప్రతి భక్తుడికీ రెండు రసీదులు ఇస్తున్నారని తెలిపారు. టీటీడీ పాలన మొత్తం పారదర్శకంగా జరుగుతుండడం ఆ ఇద్దరికీ మింగుడు పడటం లేదన్నారు. అందుకే పదే పదే చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2019లో శ్రీ వాణి ట్రస్టు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.690 కోట్ల నిధులు అందినట్లు చెప్పారు. ఆరోపణలు చేస్తున్న వారు ఎప్పుడైనా వచ్చి లెక్కలు చూసుకోవచ్చని చైర్మన్ సుబ్బారెడ్డి సవాల్ విసిరిన విషయాన్ని గుర్తు చేశారు. శ్రీవాణి నిధులతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 2445 ఆలయాలు నిర్మిస్తున్న విషయాన్ని దత్త పుత్రుడు, దత్త తండ్రి గుర్తించాలని హితవుపలికారు. మరోసారి ఇలాంటి విద్వేషపూరిత ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

బస్టాండ్‌లో కొనసాగుతున్న రద్దీ


తిరుపతి బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి క్యూకట్టిన ప్రయాణికులు

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వేస్టేషన్‌తోపాటు బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ కొనసాగుతోంది. ఆ పరిసర ప్రాంతాలు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. తిరుపతి రైల్వేస్టేషన్ మీదుగా రోజు వంద ట్రైన్లు నడుస్తున్నాయి. 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు రూ. 30 లక్షలకుపైగా ఆదాయం సమకూరుతోంది. మరో వైపు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో రద్దీ కొనసాగుతోంది. రోజూ 1.24 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసుల్లో జర్నీ చేస్తున్నారు. దీంతో రోజువారి ఆదాయం రూ.1.60 లక్షలకుపైగా సమకూరుతోంది.

సింహ వాహనంపై పరాశరేశ్వరుడు


చంద్రప్రభ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం సింహ వాహనాన్ని ఉత్సవమూర్తులు అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు, పరివార దేవతలకు అభిషేకాలను నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరునికి స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవమూర్తులు సింహవాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. ఆలయం వద్ద పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి నిమజ్జనంతో జాతర పరిసమాప్తమవుతుంది.